వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించిన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

పాల్గొన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

వికారాబాద్, అక్టోబర్ 17 : వాల్మీకి స్ఫూర్తితో ఎంతో మంది రచయితలు, కవులు తయారయ్యారని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలకు కలెక్టర్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి ముఖ్య అతిథులుగా పాల్గొని వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ రోజును జాతి గుర్తుంచుకునే దినం, ప్రపంచం ఉన్నంత వరకు రామాయణం, వాల్మీకి చరిత్ర ఉంటుందన్నారు. ఇతిహాసాల్లో మొదటిది రామాయణం, పెద్దది మహాభారతం అన్నారు. అలాంటి రామాయణాన్ని రచించింది ఒక బోయ కులానికి చెందిన చోరుడు అయిన వాల్మీకి. ఈయన ఇచ్చిన స్ఫూర్తితో అనేక మంది రచయితలు, కవులుగా మారారన్నారు. ఇతిహాసాల్లోని సారాంశాలను ఈ తరం పిల్లలకు అర్థమయ్యేలా పాఠశాల కరికులంలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి గొప్ప వారి చరిత్రల గురించి తెలుసుకోవడం నేటి తరానికి చాలా అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి మల్లేశం, గిరిజన అభివృద్ధి అధికారి కమలాకర్‌రెడ్డి , జిల్లా వెనుకబడిన తరగతుల అసిస్టెంట్ అధికారి భీమ్‌రావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో..

రంగారెడ్డి, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ) : సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఏవో సునీల్, బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కేశురాం, బీసీ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రెసిడెంట్ లక్ష్మణ్, సంఘ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు

బ్లాక్ స్పాట్‌లను గుర్తించాలి

- ప్రతి మండలంలో రహదారి భద్రతా కమిటీలను ఏర్పాటు చేయాలి
- రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి బ్లాక్ స్పాట్‌లను గుర్తించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో రహదారి భద్రతా చర్యలు అత్యంత కీలకమైనవని, అన్ని శాఖల అధికారులు బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రమాదాలను నివారించాలన్నారు. దేశంలోనే ఎక్కువ మంది రోడ్డు ప్రమాదాల కారణంగానే చనిపోవడం జరుగుతున్నదని, ప్రమాదాల నివారణకు అధికారులు కృతనిశ్చయంతో పని చేయాలన్నారు. జిల్లాలో ప్రతి మండలంలో రహదారి భద్రతా కమిటీలు ఏర్పాటు చేయాలని, ప్రమాదం జరిగిన వెంటనే ఆయా ప్రాంతాలకు బృందాలు వెళ్లి ఏ కారణంగా ప్రమాదం జరిగిందో నివేదిక ఇవ్వాలన్నారు. రోడ్డుకు సంబంధించిన ప్రతి జోన్‌కు ఒక నోడల్ అధికారిని నియమించాలన్నారు. ఆర్టీసీ అధికారులు బ్లాక్ స్పాట్‌లను గుర్తించి తగిన నివేదికను జిల్లా యంత్రాంగానికి ఇవ్వాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేసేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్టీసీ డ్రైవర్లు సహా, ఇతర ప్రైవేట్ వాహనాల ఆపరేటర్లు రోడ్డు భద్రతా చర్యలు విధిగా పాటించేలా నిబంధనల పట్ల స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృత చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్య కూడళ్లు, ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, తినుబండారాలు విక్రయించే బండ్లు, పార్కింగ్ స్థలాలను గుర్తించి ముఖ్య కూడళ్లలో ఉండకుండా చూడాలని, వారికి వేరే ప్రాంతంలో స్థలాలను గుర్తించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండేలా హైస్కూల్ నుంచి డిగ్రీ స్థాయి వరకు విద్యార్థులను ట్రాఫిక్ శిక్షణా కేంద్రాలకు తీసుకువెళ్లి అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారికి సూచించారు.

సమావేశంలో సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్, రాచకొండ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, డీఆర్వో సంగీత, ఎన్‌హెచ్ డీఈ సబిత, ఆర్టీసీ జోనల్ అధికారి సుచరిత, జీహెచ్‌ఎంసీ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- గ్రూప్-1 పరీక్షా కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

రంగారెడ్డి, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులకు సూచించారు. ఈ నెల 21 నుంచి నిర్వహించే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల కోసం చేపట్టాల్సిన విధివిధానాలపై గురువారం సచివాలయం నుంచి ఆమె డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, పోలీస్ కమిషనర్లు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు నోడల్ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్తు, టాయిలెట్స్, తాగునీరు ఉండేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. రూట్ ఆఫీసర్లు, రీజనల్ కోఆర్డినేటర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఐడెంటిఫికేషన్ అధికారులు, లైజన్ అధికారులు పరీక్ష నిర్వహణలో తమకు కేటాయించిన విధులు పూర్తి బాధ్యతతో నిర్వహించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రూట్ అధికారులు, శాఖల అధికారులు, ఐడెంటిఫికేషన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, పోలీస్ నోడల్ అధికారులు తమ విధులను ఏ విధంగా నిర్వహించాలన్న దానిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, అధికారులు

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సచివాలయం నుంచి పాల్గొన్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా ప్రజా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి, మైనార్టీ వెల్ఫేర్ అధికారి నవీన్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, అధికారులున్నారు.

ఎంపీడీవో కార్యాలయం సందర్శన



మైలార్‌దేవరంపల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

బంట్వారం(కోట్‌పల్లి), అక్టోబర్ 17 : కోట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం జడ్పీ సీఈవో, జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆకస్మికంగా కార్యాలయంలోకి రావడంతో స్థానిక సిబ్బంది ఆశ్చర్యానికి గురయ్యారు. కార్యాలయంలోని సిబ్బంది పనితీరు, వివరాలను ఎంపీడీవో డానియేల్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలన్నారు. రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం తాండూరులో మృతిచెందిన టెక్నికల్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

వికారాబాద్ మండలంలోని మైలార్‌దేవరంపల్లి గ్రామాన్ని సందర్శించి ఎస్‌డీఎఫ్ నిధులచే చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వినయ్‌కుమార్, ఎంపీవో, ఏఈ పీఆర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి ఉన్నారు.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డిజిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రామారావు

షాబాద్, అక్టోబర్ 17 : అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని రంగారెడ్డిజిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డిజిల్లాలో 2024-25 సంవత్సరానికిగాను అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద విదేశీ విద్యాలయాల్లో చదువుతున్న షెడ్యూల్డ్ కులాల అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు ఉపకార వేతనాల కోసం <http://telangana.epass.cgg.gov.in>లో దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 29 వరకు పొడిగించడం జరిగిందన్నారు.

మండల కేంద్రంలో గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలు చేసి గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. గురువారం గ్రామస్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి.. డప్పు దరువులు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల శిగాల మధ్య గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

- నందిగామ, అక్టోబర్ 17

బస్సు బైక్ ఢీ ముగ్గురు మృతి

ప్రవీణ్

హర్షకుమార్

నవీన్‌కుమార్

సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలిస్తున్న ఎస్సీ నారాయణరెడ్డి

పూడూరు, అక్టోబర్ 17 : ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందిన ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మధుసూదన్‌రెడ్డి కథనం ప్రకారం.. పూడూరు మండలం మేడికొండ గ్రామానికి చెందిన చిలుకమర్రి నవీన్‌కుమార్(21), బుగ్గనోళ హర్షకుమార్(15), గొంగుపల్లి గ్రామానికి చెందిన మిట్టకంకంటి ప్రవీణ్(20) గురువారం ఒకే బైక్‌పై మేడికొండ గ్రామం నుంచి హైదరాబాద్-బీజాపూర్ హైవే రోడ్డుపై మన్నెగూడ వైపు వస్తున్నారు. అదే సమయంలో పూడూరు గేట్ సమీపంలోని టర్నింగ్ వద్ద హైదరాబాద్ డిపో-1 బస్ కర్ణాటక రాష్ట్ర సేడంకు ప్రయాణికులతో వెళ్తున్నది. టర్నింగ్ వద్ద బస్సు, బైక్ ఢీ కొనగా ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో వ్యక్తిని పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. వీరిలో ప్రవీణ్‌కు భార్య, ఒక కుమారుడు ఉండగా, అతను రోజు వారి కూలీ పనికి వెళ్లేవాడు. హర్షకుమార్ వికారాబాద్ సమీపంలోని అనంతగిరి పల్లి గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. నవీన్ కుమార్ వికారాబాద్‌లోని ఎస్‌ఏపీ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. జరిగిన సంఘటనతో ఇరు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని మాజీ సర్పంచ్ అనంతరెడ్డి కోరారు. మృతుల కుటుంబసభ్యులు, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. పరిగి దవఖానలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.

అరగంటలో మరో ప్రమాదం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందిన ప్రాంతంలోనే మరో ప్రమాదం జరిగింది. అదే రోడ్డు మలుపు వద్ద పరిగి నుంచి మన్నెగూడ వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి రోడ్డు పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లింది. లారీ డ్రైవర్ నేరుగా వెళ్తే మరో రోడ్డు ప్రమాదం జరిగేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ రోడ్డు మలుపు సమీపంలో గత రెండు నెలల్లోనే మూడు ప్రమాదాలు వేర్వేరుగా జరుగగా పలువురు మృతిచెందారు. లారీ డ్రైవర్ మద్యం తాగి ఉండంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సంఘటనా స్థలం సందర్శన

హైదరాబాద్-బీజాపూర్ హైవే రోడ్డు పూడూరు గేటు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదాన్ని తెలుసుకున్న వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించి జరిగిన ప్రమాదంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు మలుపులను, ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంలో ఎవరిది తప్పిదమో విచారణ చేయాలని పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డిని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చూడాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో పరిగి సీఐ శ్రీనివాస్, విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, విజిలెన్స్ ఆఫీసర్ మహంకాళి రామ్మూర్తి, హైదరాబాద్-1, వికారాబాద్, పరిగి బస్ డిపోల మేనేజర్లు కృష్ణారెడ్డి, అరుణ, కరుణశ్రీ ఉన్నారు.

బాధితులకు పరామర్శ

రోడ్డు ప్రమాదంలో మృతిచెందినవారి కుటుంబాలను అసుపత్రి వద్ద పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పరామర్శించారు. మృతుల అంత్యక్రియలకు వారి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం అందజేశారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. చిన్న వయస్సులో మృతిచెందడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ మృతుల కుటుంబాలకు అండగా ఉంటుందని మహేశ్‌రెడ్డి తెలిపారు. వీరితో పాటు పలువురు మండల నాయకులు ఉన్నారు.

పరిగి ప్రభుత్వ అసుపత్రి వద్ద మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పాఠశాలకు తాళం వేసిన గ్రామస్తులు

పాఠశాలకు తాళం

ఉపాధ్యాయుడిని ఎలా రిలీవ్ చేశారంటూ పర్వత్‌పల్లి గ్రామస్తుల ఆగ్రహం

బషీరాబాద్, అక్టోబర్ 17 : కొత్త ఉపాధ్యాయుడు రాకుండా పాత ఉపాధ్యాయుడిని ఎలా రిలీవ్ చేస్తారని పర్వత్‌పల్లి గ్రామస్తులు గురువారం పాఠశాల ఎదుట ఆందోళనకు దిగి ఏకంగా పాఠశాలకు తాళం వేశారు. గ్రామంలోని అప్పర్ ప్రైమరీ పాఠశాలలో 101 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గ్రామానికి చెందిన విద్యార్థులతోపాటు, మర్పల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు ఇక్కడ పాఠాలు నేర్చుకుంటున్నారు. 101 విద్యార్థులకు గాను ఆరుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. వారిలో ఒక ఉపాధ్యాయుడు బదిలీ కావడంతో అధికారులు అతడిని రిలీవ్ చేశారు. దీంతో గ్రామస్తులు కొత్త ఉపాధ్యాయుడు రాకుండానే ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పాత ఉపాధ్యాయుడిని ఎలా రిలీవ్ చేస్తారంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలానికి మారుమూలన ఉన్న గ్రామం తమదని, మా పిల్లలు చదువుకోవద్దా అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ఉపాధ్యాయుడిని నియమించేవరకు తమ పిల్లలను పాఠశాలకు పంపించబోమని పాఠశాలకు తాళం వేశారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రిలీవ్ చేశాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే బదిలీ అయిన ఉపాధ్యాయుడిని రిలీవ్ చేశాం. అతడికి జూన్‌లోనే బదిలీ అయింది. విద్యార్థులకు నష్టం జరుగొద్దని ఇన్ని రోజులు రిలీవ్ చేయలేదు. ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతోనే ఉపాధ్యాయుడిని అక్కడి నుంచి రిలీవ్ చేశాం. త్వరలోనే కొత్త ఉపాధ్యాయుడిని నియమిస్తాం.

- ఎంఈవో సుధాకర్‌రెడ్డి

ఇందిరమ్మ కమిటీల్లో గందరగోళం

మంచాలలో కమిటీ సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

మంచాల, అక్టోబర్ 17 : మంచాల మండలం వివిధ గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద గురువారం ఇందిరమ్మ కమిటీల గ్రామ సభ ఎంపిక సమావేశాలను నిర్వహించారు. ఇందిరమ్మ కమిటీల్లో గ్రామ ప్రత్యేకాధికారి చైర్మన్‌గా ఉండగా పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. అందులో మరో ఐదు మంది సభ్యుల్లో ఎస్సీ, ఎస్టీ నుంచి ఒకరు, బీసీ నుంచి ఒకరు, డ్వాక్రా సంఘాల నుంచి ఇద్దరు, జనరల్ నుంచి ఒకరు ఉంటారు. అయితే కమిటీలో తామే ఉంటామని కాంగ్రెస్ కార్యకర్తలు పేర్కొనడంతో జాపాలలో జరిగిన ఇందిరమ్మ కమిటీల ఎంపికలో కొద్దిసేపు గందరగోళం నెలకొన్నది. దీంతో పంచాయతీ కార్యదర్శి తన చేతిలో ఏమీ లేదంటూ.. ఇక్కడికి వచ్చినవారి పేర్లు ఇవ్వాలని.. ఈ పేర్లను మండల అధికారులకు పంపిస్తానని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ఇందిరమ్మ కమిటీల్లో అన్ని పార్టీల వారికి అవకాశం కల్పిస్తే ఇండ్లులేని నిరుపేదలకు న్యాయం జరుగుతుందని.. లేకుంటే ఏకపక్షంగానే కాంగ్రెస్‌వారు వ్యవహరిస్తే అర్హులకు అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్, సీపీఎం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నవాబుపేట వర్కింగ్ ప్రెసిడెంట్ ఘనపురం శాంతికుమార్ మర్యాదపూర్వంగా కలిశారు. అనంతరం శాంతికుమార్ మాట్లాడుతూ.. నూతనంగా నియమించిన నవాబుపేట కమిటీ పనితీరుపై కేటీఆర్ ఆరా తీశారని.. కార్యకర్తలను కలుపుకొని ముందుకు వెళ్లాలని సూచించినట్లు చెప్పారు.

- నవాబుపేట, అక్టోబర్ 17

లింగన్నపల్లిలో గుప్తనిధుల తవ్వకం

కులకచర్ల, అక్టోబర్ 17 : చౌడాపూర్ మండల పరిధిలోని లింగన్నపల్లి గ్రామంలో గుప్తనిధుల తవ్వకం కలకలం రేపింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగన్నపల్లి గ్రామ శివారులో గురువారం ఉదయం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కొంతభాగాన్ని తవ్వి పూజలు చేస్తున్న క్రమంలో గ్రామస్తులు ఆ శబ్దాన్ని విని అక్కడకు వెళ్లి చూడగా పూజలు నిర్వహిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. గ్రామస్తులు వెంటనే ఈ విషయాన్ని కులకచర్ల పోలీసులకు తెలియజేయగా.. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల వారిని విచారించారు. గ్రామంలో ఎవ్వరు కూడా ఎలాంటి భయాందోళనకు గురికాకూడదని.. సంఘటనకు సంబంధించిన వారిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌కు భూమి పూజ

అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న స్పీకర్

వికారాబాద్, అక్టోబర్ 17 : వికారాబాద్ జిల్లాలో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం భూమి పూజ చేశారు. రాజీవ్ గృహ కల్ప ప్రాంతంలో అర ఎకరా భూమిలో సుమారు రూ.5 కోట్ల ఖర్చు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం భవన నిర్మాణం ప్లాన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐటీఐ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఐటీఐ ప్రిన్సిపాల్ నరేంద్రబాబు, టీజీఐఐసీ సిబ్బంది ఉన్నారు.

జిల్లా గ్రంథాలయం పేరు, ప్రతిష్ఠలకు నిలయం

జిల్లా గ్రంథాలయం పేరు, ప్రతిష్ఠలకు నిలయమని, ఆ పేరును సార్థకం చేస్తూ ముందుకు వెళ్లాలని తెలంగాణ రాష్ట్ర శాసన సభపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన గ్రంథాలయ జిల్లా చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ వికారాబాద్ జిల్లా గ్రంథాలయం చైర్మన్‌గా ప్రమాణం చేసిన రాజేశ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ఇక్కడ అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని.. పాఠకులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాల్లో ఉండాలని కోరారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ తానూ గ్రంథాలయంలో చదువుకునే ఈ స్థాయిలో ఉన్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిగి, తాండూరు శాసనసభ్యులు పాల్గొన్నారు.

కూతురు ప్రేమ వ్యవహారం

తల్లి ప్రాణాలమీదకు తెచ్చింది

- పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం
- తనకు న్యాయం చేయాలంటూ పోలీసులకు వేడుకోలు

బషీరాబాద్, అక్టోబర్ 17 : ఓ కూతురు ప్రేమ వ్యవహారంతో తల్లి తప్పనిసరి పరిస్థితుల్లో పెట్రోల్ డబ్బాతో బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం జరిగింది. ఇందుకు సంబంధించి బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాలు.. కొత్లాపూర్ గ్రామానికి చెందిన దేవీబాయికి ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. చాలా ఏండ్ల క్రితం దేవీబాయి భర్త చనిపోయాడు. నాలుగు నెలల క్రితం దేవీబాయి పెద్ద కూతురును అదే గ్రామానికి చెందిన భీంజికి ఇచ్చి ఘనంగా పెళ్లి జరిపించింది. పెళ్లయిన కొన్ని రోజులకు బతుకు దెరువు కోసం భీంజి భార్యను తీసుకొని జడ్చర్లకు వెళ్లాడు. పెద్ద కూతురుకు అప్పటికే కంసాన్‌పల్లితండాకు చెందిన వినోద్ అనే యువకుడితో ప్రేమ వ్యవహారం కొనసాగుతుండటంతో రెండు నెలల క్రితం జడ్చర్ల నుంచి ప్రేమికుడితో లేచిపోయి విహహం చేసుకుంది. దీంతో భర్త భీంజి జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అదే సమయంలో కంసాన్‌పల్లి తండాకు చెందిన వినోద్(ప్రేమికుడి) తండ్రి బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు వారి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. కుల పెద్దలు పంచాయితీ పెట్టి మొదటి భర్తకు రెండో భర్త(ప్రేమించిన వ్యక్తి) రూ.14 లక్షలు చెల్లించాలని నిర్ణయించి.. కొంత సొమ్ము ఇచ్చి రెండు నెలలు గడువు ఇచ్చారు. గడువు పూర్తి కావడంతో డబ్బుల కోసం దేవీబాయితో కులపెద్దలు గొడవపడ్డారు. దీంతో ఆమె తాను డబ్బులు ఎక్కడి నుంచి తేవాలని.. రెండో అల్లుడిస్తే ఇస్తానని వారికి చెప్పింది. గొడవ ఎక్కువ కావడంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తనకు న్యాయం చేయాలని ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో ఎస్సై గఫార్ సిబ్బందిని పురమాయించి పెట్రోల్ డబ్బాను లాక్కో